

బాపట్ల పట్టణంలో 216 ఏ జాతీయ రహదారిపై నిలిచిన వర్షపు నీరు

నాణ్యత లేని పనులు.. జాతీయ రహదారిపై నీళ్లు

జిల్లా కేంద్రం బాపట్లలో 216 ఏ జాతీయ రహదారిని రూ.72 కోట్లతో విస్తరించారు. గత వైకాపా పాలనలో మార్కెట్‌యార్డు నుంచి బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల వరకు 8.5 కి.మీ. రహదారి విస్తరణ పనులు పూర్తి చేశారు. భారీ వర్షం కురిస్తే నీరు రహదారిపై నిలవకుండా సిమెంటు కాలువలోకి వెళ్లేలా చేసిన పనుల్లో నాణ్యత లేకుండా పోయింది. పట్టణంలో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎన్టీఆర్ ఏజీ ఇంజినీరింగ్ కళాశాల ఎదుట జాతీయ రహదారిపై నీరు నిలిచి కొలనును తలపిస్తోంది. బాపట్లలోకి వచ్చే మార్గంలో సగానికి పైగా నీరు చేరింది. ఈ ప్రాంతంలో గత నెలరోజుల్లో పది రోడ్డు ప్రమాదాలు సంభవించి నలుగురు మృతి చెందారు. రోడ్డుపై నిలిచిన నీరు కాలువలోకి వెళ్లేలా ఎన్‌హెచ్ అధికారులు గుత్తేదారు చేత పనులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బాపట్ల

జడ్పీ రికార్డుల పరిశీలన

గుంటూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర 5వ ఆర్థిక సంఘం సభ్యులు ఆచార్య ఎం.ప్రసాదరావు, ఆచార్య ఎంవీఎస్ పద్మారావు, కె.కృపారావు, తాఖుద్దీన్ జిల్లాపరిషత్తు కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. వార్షిక బడ్జెట్, నిధుల వినియోగం, ఇ-గ్రామ స్వరాజ్ పోర్టల్, ఆడిట్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించగా..సీఈవో జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ వివరాలు తెలిపారు. అనంతరం సీఈవో ఛాంబర్‌లో సమావేశం నిర్వహించి జడ్పీ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు.

అమాత్యా.. అభివృద్ధికి సారథి కావాలి

- జిల్లా ఇంఛార్జి మంత్రిగా కొలుసు పార్థసారథి నియామకం
- యువతకు ఉపాధి కల్పించేలా చర్యలు అవసరం

ఈనాడు–బాపట్ల



జిల్లా ఇంఛార్జి మంత్రిగా రాష్ట్ర గృహ నిర్మాణ, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని ప్రభుత్వం నియమించింది. జిల్లాలో అధికార యంత్రాంగాన్ని.. ప్రజాప్రతినిధులను సమన్వయపరిచి ఆయా అభివృద్ధి పనుల్ని పట్టాలెక్కించాల్సిన బాధ్యత ఇంఛార్జి మంత్రిపై ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని ఆరు అసెంబ్లీ, ఎంపీ స్థానాన్ని కూటమి అభ్యర్థులే దక్కించుకున్నారు. దీంతో కూటమి ప్రభుత్వంపై ప్రజల ఆశలు, ఆకాంక్షలు చాలా ఉన్నాయి. పూర్తిగా వ్యవసాయాధారిత జిల్లా కావడంతో ప్రధానంగా పంట కాలువలు, డ్రెయిన్లు వంటివి శిథిలావస్థకు చేరాయి. దీంతో భారీ వర్షం కురిసినా.. వరదలు వచ్చినా పంట పొలాలు మునకకు గురై రైతాంగం నష్టపోతోంది. అదేవిధంగా ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడానికి జిల్లాలో వనరులు అనేకం ఉన్నాయి. 74 కిలోమీటర్ల పరిధిలో కోస్తా తీరం ఉంది. ఇక్కడ మత్స్య, ఆక్వా పరిశ్రమల స్థాపనకు అవకాశాలు ఉన్నాయి.

పర్యాటకంగా అవకాశాలు అపారం

పర్యాటకపరంగా అభివృద్ధి చెందడానికి అనేక అవకాశాలు ఉన్నాయి. సూర్యలంక, రామాపురం బీచ్‌లకు తెలంగాణ రాష్ట్రాల నుంచి పర్యాటకులు పోటెత్తుతున్నారు. అయితే ఈ బీచ్‌లను గత వైకాపా ప్రభుత్వం విస్మరించడంతో సౌకర్యాలు కొరవడటమే కాదు కనీసం రక్షణ చర్యలు లేవు. ప్రమాదవశాత్తు సముద్రంలో గల్లంతైతే వెంటనే వారిని గుర్తించి ప్రాణాలతో కాపాడడానికి అవసరమైన గజ ఈతగాళ్లను శాశ్వతంగా నియమించి ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా మరింత ఇనుమడింపజేసేలా ఇంఛార్జి మంత్రి చొరవ తీసుకోవాలి. రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నం హార్బర్, దిండి ఆక్వా పార్కు వంటి నిర్మాణాలను సాకారమయ్యేలా ఆ పనులను వేగవంతం చేయించాలి. చీరాలలో చేనేత పార్కు నిర్మాణం, పోతార్లంక ఎత్తిపోతల పథకం, గుండ్లకమ్మ జలాశయం, ఎర్రంచినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం, భవనాశి చెరువు ఆధునికీకరణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తి చేయిస్తే వేలాది ఎకరాల ఆయకట్టు పెరగటంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది. అద్దంకి-మార్టూరు ప్రాంతాల్లో మైనింగ్ పరిశ్రమల ద్వారా ఎక్కువ మందికి ఉపాధి లభ్యమయ్యేలా పలు చిన్న, మధ్యతరహా పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నేతల మధ్య సమన్వయం ముఖ్యమే..

ఒకవైపు అభివృద్ధి పనుల్ని వేగవంతం చేయించడంతో పాటు మరోవైపు పార్టీని ఏకతాటిపై నడపాల్సిన బాధ్యత ఇంఛార్జి మంత్రిపై ఉంది. తెదేపా-జనసేన-భాజపా నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయ లోపం లేకుండా అందరూ కలిసి కట్టుగా కూటమి ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. జిల్లాకు చెందిన అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ మంత్రులుగా ఉన్నారు. వేమూరు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆనందబాబు గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. ఇక పర్చూరు నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు ఉన్నారు. చీరాల నుంచి ఎం.కొండయ్య, బాపట్ల నుంచి వేగేశన నరేంద్రవర్మ తొలిసారిగా శాసనసభలోకి అడుగుపెట్టారు. బాపట్ల ఎంపీగా తెన్నేటి కృష్ణప్రసాద్ ఉన్నారు. సీనియర్, జూనియర్లను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి. రెండు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో ఉన్న పార్థసారథికి రాజకీయ అనుభవంతో పాటు గతంలో మంత్రిగా పనిచేశారు. ఆపై విద్యాధికుడు కావటంతో అవన్నీ జిల్లా అభివద్ధికి దోహదపడతాయని రాజకీయ వర్గాలు అంటున్నాయి.



పెదగంజాం వద్ద వరద నీటిలో పంటలు



నాగన్నవాగు చప్టాపై అయిదు అడుగుల ఎత్తులో పారుతున్న వరద నీరు

వర్షం.. భయం భయం

అద్దంకిలో 136.4 మి.మీ. వర్షపాతం నమోదు



బకింగ్‌హాం కాలువ చప్టా వద్ద ఆర్టీసీ బస్సు నిలిపివేసిన అధికారులు

పెదగంజాం, పల్లెపాలెనికి రాకపోకలు బంద్

బాపట్ల, న్యూస్‌టుడే

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మంగళవారం భారీ వర్షం కురిసింది. అద్దంకిలో అత్యధికంగా 136.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. వర్షానికి రహదారులు చిత్తడిగా మారాయి. బాపట్ల పట్టణంలో లోతట్టు ప్రాంతాలు, జగనన్న కాలనీల్లో నివాస గృహాల చుట్టూ నీరు చేరింది. చినగంజాంలో మండలంలో 88.8 మి.మీ. వర్షం కురిసింది. నీలాయపాలెం, పెదగంజాం గ్రామాల చుట్టూ వరద నీరు చేరి వరి, వేరుసెనగ పొలాలు మునిగిపోయాయి. పర్చూరు వాగు పొంగిపొర్లి యద్దనపూడి-చిలుకూరివారిపాలెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

చినగంజాం మండలాన్ని వదలని వాన

తుపాను హెచ్చరికలు, భారీ వర్షాల కారణంగా సముద్రంలో రెండ్రోజులుగా చేపల వేట నిలిచిపోయి నిజాంపట్నం హార్బర్‌కే వేట పడవలు పరిమితమయ్యాయి. బాపట్ల మండలంలో సూర్యలంక, రామచంద్రాపురం, ఈపూరిపాలెం కాలువ, వాడరేవు ఒడ్డున వందల సంఖ్యలో పడవలు నిలిపివేశారు. జిల్లాలోని 25 మండలాల్లో 1464.9 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, సగటున 58.59 మి.మీ. వర్షం కురిసింది. అల్పపీడనం వాయుగుండంగా, తుపానుగా మారి ఈనెల 18 వరకు భారీవర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి, ఉద్యానపంటలు దెబ్బతింటాయని, కోలుకోలేని విధంగా నష్టపోతామని భయపడుతున్నారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు..

జిల్లా పరిధిలోని చుండూరులో 72.8 మి.మీ, అమృతలూరు 96.5, వేమూరు 60, కొల్లూరు 41, భట్టిప్రోలు 64.6, చెరుకుపల్లి 34.4, పిట్టలవానిపాలెం 70.4, కర్లపాలెం 55.2, బాపట్ల 67.2, నిజాంపట్నం 60.6, నగరం 41.8, రేపల్లె 67.4, సంతమాగులూరు 18.6, బల్లికురవ, 34.4, మార్టూరు 33.4, యద్దనపూడి 32.2, పర్చూరు 39.2, కారంచేడు 63.4, ఇంకొల్లు 61.2, జేపంగులూరు 62.4, అద్దంకి 136.4, కొరిశపాడు 54.2, చీరాల 72.2, వేటపాలెం 36.6, చినగంజాం 88.8 మి.మీ వర్షపాతం నమోదైంది.



వరద నీటిని సముద్రంలోకి పంపేలా పేరాయికాలువలో అడ్డు కట్టను తొలగించే పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

నాగన్న వాగు వద్ద పోలీసుల పహారా

పెదగంజాం(చినగంజాం), న్యూస్‌టుడే: చినగంజాంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాగన్నవాగు, కొంగలవాగు చప్టాలపై సుమారు అయిదడుగుల ఎత్తులో నీరు పారింది. వర్షపు నీటితో పాటు ఎగువ ప్రాంతంలోని వరద నీరు దిగువనున్న నీలాయపాలెం, పెదగంజాం గ్రామాలను చుట్టుముట్టింది. దీంతో ఆ గ్రామాలతో పాటు పల్లెపాలెం చుట్టూ నీరు చేరి బయట ప్రపంచంతో సంబంధాలు లేకుండా పోయాయి. ఆ వాగుల వద్ద ప్రజల రాకపోకలు చేయకుండా ట్రాక్టర్లను అడ్డుపెట్టారు. దీన్ని తహసీల్దార్ ఉప్పలపాటి శ్రీనివాసరావు, ఎస్సై శీలం రమేష్, తెదేపా తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆనోది సుబ్బారెడ్డి, నీలాయపాలెం, పెదగంజాం సర్పంచులు తూమాటి శ్రీనివాసరావు, నక్కల కృష్ణ పర్యవేక్షించారు. మూడు గ్రామాల చుట్టు ఉన్న కాలువల్లో అడ్డుగా ఉన్న కట్టలను జేసీబీతో తొలగించి వరద నీటిని పేరాయి కాలువ ద్వారా సముద్రంలోకి పంపేలా అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లోనే ఉండి పర్యవేక్షించారు. వరద వల్ల పెదగంజాం, నీలాయపాలెం, పల్లెపాలెంలో నెల రోజుల్లో వేసిన సుమారు 500 ఎకరాల్లో వరి పైరు, 200 ఎకరాల్లో వేరుసెనగ, 50 ఎకరాల్లో గెనిసెగడ్డ పంటలు మునిగాయని పలువురు రైతులు తెలిపారు. సాయంత్రం చీరాల ఆర్టీసీ డిపోనకు చెందిన బస్సు ఎన్టీఆర్ వారధి మీదుగా పెదగంజాం గ్రామానికి వస్తుండగా అధికారులు, నాయకులు ఎదురెళ్లి బకింగ్‌హాం కాలువ చప్టా వద్ద ఆపేశారు. చప్టాపై వరద నీరు రావడంతో బస్సులోని ప్రయాణికులను అక్కడే దించి, కాలినడకన పెదగంజాంకు పంపించారు. బస్సును అక్కడ నుంచి చీరాల వైపు మళ్లించారు.

ఇసుక తవ్వకాల టెండర్లు ఖరారు

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో కొల్లూరు మండలం గాజుల్లంక, జువ్వలపాలెం వద్ద కృష్ణా నది రేవుల్లో ఇసుక తవ్వకాల టెండర్లను తులసి కన్‌స్ట్రక్షన్స్ సంస్థ దక్కించుకుంది. టన్ను ఇసుకు గనుల శాఖ రూ.115లు చెల్లించేలా టెండర్‌లో కోట్ చేసింది. రెండు రేవుల్లో ఇసుక తవ్వకాలకు పది టెండర్లు రాగా అందరి కంటే తక్కువ కోట్ చేసిన గుత్తేదారు సంస్థ తులసి కన్‌స్ట్రక్షన్స్‌ను ఎంపిక చేశారు. అయితే రేవుల్లో బుధవారం నుంచి మనుషులతో ఇసుక తవ్వకాలు ప్రారంభించే అవకాశం లేదు. కృష్ణా నదిలో నీరు ఉండటంతో మరో రెండు వారాల తర్వాత నవంబరు మొదటి వారం నుంచి తవ్వకాలు చేపట్టటానికి గనుల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తవ్వకాలు ప్రారంభమైన తర్వాత రేవులో ఇసుక తవ్వి ఒడ్డుకు గుత్తేదారు సంస్థ చేర్చాల్సి ఉంది.

నేటి నుంచి నాటకోత్సవాలు

గుంటూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి, అభినయ థియేటర్ ట్రస్టు, గుంటూరు ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు, యశోద ఫౌండేషన్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నుంచి గుంటూరులో నారా చంద్రబాబునాయుడు నాటకోత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకుడు అభినయ శ్రీనివాస్ తెలిపారు. గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాయంత్రం ఆరు గంటలకు పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్సవాలను ప్రారంభిస్తారు.



కొత్తపేటలో తడిసిన మినుము పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

జిల్లాలో 200 ఎకరాల్లో పంట నష్టం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 200 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాను ఉన్నతాధికారులకు నివేదించామని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ తెలిపారు. వేటపాలెం మండలం కొత్తపేటలో కోసిన మినుము పంట వర్షాలకు తడిసి పోవడంతో దాన్ని ఆయన మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. అంచనాలో 160 ఎకరాలు వరి, మినుము 10, వేరుసెనగ 30 ఎకరాల వరకు ఉంటోందన్నారు. వర్షం తప్ప ఎటువంటి గాలులు లేకపోవడంతో ఎక్కడా వరిపైరు పడిపోయిన ఘటనలు లేవన్నారు. ఉదయం నుంచి ఎండ రావడంతో ఇప్పటికే పొలాల్లో ఉన్న నీరు చాలా చోట్ల బయటకు వెళుతోందని చెప్పారు. మరో రోజు ఆగితే వాస్తవంగా ఏమేరకు పంట నష్టం వాటిల్లిందో కచ్చితంగా ఒక అంచనాకు రావచ్చన్నారు. వెంట వ్యవసాయాధికారి కాశీవిశ్వనాథం ఉన్నారు.

రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు వేగవంతం



అప్పికట్ల- మాచవరం మధ్య రైల్వే ట్రాక్‌పై మరమ్మతులు

పొన్నూరు, న్యూస్‌టుడే: చెన్నై - విజయవాడ మార్గంలో బాపట్ల మండలం అప్పికట్ల రైల్వే స్టేషన్ నుంచి పొన్నూరు మండల పరిధి మాచవరం రైల్వే స్టేషన్ మధ్యలో కుంగిపోయిన రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేశారు. మంగళవారం ఆ శాఖ ఉన్నతాధికారులు ట్రాక్‌ను పరిశీలించారు. కుంగిన ప్రాంతానికి ఒకవైపు ట్రాక్‌కు పటిష్ఠం చేయడానికి 6 జేసీబీలతో పనులు చేస్తున్నారు. దాదాపు 150 మంది సిబ్బంది ఇందులో నిమగ్నమయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాక్‌పై నుంచి ప్రస్తుతం రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి.

ప్రైవేటు మద్యం విక్రయాలు నేటి నుంచే..

ఈనాడు – అమరావతి

వ్యాపారుల చేతికి లైసెన్సులు

ప్రభుత్వ మద్యం దుకాణాలకు మంగళవారంతో తెరపడింది. బుధవారం నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి వస్తోంది. ఈ విధానంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు కలిపి 373 ప్రైవేటు దుకాణాలకు ఎక్సైజ్ శాఖ అధికారులు లైసెన్సులు మంజూరు చేశారు. వీటిని మంగళవారమే తీసుకున్న వ్యాపారులు ఆయా ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఇప్పటివరకు ప్రభుత్వ దుకాణాలు నడిపిన ప్రదేశాల్లోనే ప్రైవేటువి ఏర్పాటు చేసుకోవడానికి సంబంధిత భవనాల యజమానులతో సంప్రదింపులు జరుపుతున్నారు. అవసరమైతే ఎక్కువ అద్దె చెల్లించేందుకూ ముందుకొస్తున్నారు.

డిపోల వద్ద రద్దీ లేకుండా జాగ్రత్తలు

కొత్త దుకాణాలకు బుధవారం ఉదయం నుంచి డిపోల్లో మద్యం ఇస్తారు. తొలిరోజు కావడంతో ఎక్కువ రద్దీకి అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతో తగిన స్థాయిలో నిల్వలు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని గుంటూరు, తెనాలి, నరసరావుపేట డిపోల అధికారులకు ఎక్సైజ్ ఉన్నతాధికారులు సూచించారు. ఈ మేరకు మంగళవారం వారితో సమావేశమయ్యారు. చలానాలు తీసుకెళ్లిన వారికే డిపోల్లో మద్యం అందిస్తారు. మంగళవారం రాత్రి 9 గంటలతో ప్రభుత్వ దుకాణాలకు తెర పడుతుంది. అప్పటికి ఏమైనా నిల్వ లుంటే వాటిని డిపోల్లో అప్పగించాలని అధికారులు ఆదేశించారు.




వాటాల కోసం సంప్రదింపులు

మద్యం వ్యాపారంలో అనుభవం ఉన్న చాలామంది సిండికేట్లుగా ఏర్పడి దరఖాస్తులు చేశారు. వీరికి చాలా తక్కువ సంఖ్యలో దుకాణాలు దక్కాయి. కొంతమంది నేతలకూ ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ నేపథ్యంలో దుకాణాలు దక్కించుకున్న కొత్తవారితో మంతనాలు జరుపుతున్నారు. కొంత వాటా ఇవ్వాలని, తామే వ్యాపారం చేసిపెడతామని లాబీయింగ్ చేస్తున్నట్టు తెలిసింది. కొన్నిచోట్ల ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని స్థానికుల్ని వ్యాపార భాగస్వాములుగా చేర్చుకుంటే అన్నివిధాలుగా అండగా ఉంటారని సూచిస్తున్నట్టు సమాచారం. ప్రధానంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వైద్యులు, ఇతర వృత్తి నిపుణులపై ఈ ఒత్తిడి ఎక్కువగా ఉంది. దుకాణాలు దక్కించుకున్న ఇతర రాష్ట్రాల వారినీ వాటాలు కోరుతున్నారు.

సామగ్రి మాకివ్వండి కొంటాం

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉన్న ఫ్రిజ్‌లు, స్కానర్లు, ఫేక్ కరెన్సీని గుర్తించే టెస్టర్ యంత్రాలు, కుర్చీలు, బల్లలు, ఫ్యాన్లను కొనుగోలు చేస్తామంటూ కొత్త దుకాణదారులు ముందుకొస్తున్నారు. ఆ సామగ్రిని డిపో లేదా గోదాములో నిల్వ చేయాలన్న ఆదేశాలున్నాయి తప్ప విక్రయించాలని ఉత్తర్వులు రాలేదని అధికారులు చెబుతున్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ కృష్ణప్రసాదు

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం

కర్లపాలెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాదు తెలిపారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా కర్లపాలెంలో రూ.60 లక్షల నిధులతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. పల్లెలను దశల వారీగా అభివృద్ధి చేసేందుకు పల్లె పండుగ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. తహసీల్దారు సుందరమ్మ, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీవో మహేష్, సర్పంచి లలితకుమారి, జడ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జీడిపప్పు

జీడిపప్పు అందనంటోంది

- పెరిగిన ధరలు.. తగ్గిన అమ్మకాలు
- పరిశ్రమపై ఆధారపడిన వారి ఉపాధికి గండి

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే

పాయసంలోకైనా.. ఉప్మాలోకైనా జీడిపప్పు వేయనిదే ఆ ఆహార పదార్థానికి అంత రుచి రాదు.. అలాంటిది వీటి ధరలు పెరగడంతో వినియోగదారులకు చేదును మిగుల్చుతుండగా.. పెరిగిన ధరలతో అమ్మకాలు పడిపోయాయని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ఉత్తర భారతంలోని గుజరాత్, రాజస్థాన్, దిల్లీ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాల్లో దీపావళికి జీడిపప్పు వినియోగం ఎక్కువ. దాని ప్రభావంతోనే ఇక్కడ ధరలు పెరిగాయని వీరు చెబుతున్నారు.

ఈ ఏడాది ఏప్రిల్‌లో జీడిగింజల బస్తా ఒక్కంటికి (80 కిలోలు) ధర రూ.9800 ఉంది. గడిచిన అయిదు నెలల్లో పెట్టుబడులకు వడ్డీ, గింజల ఆరుదల కలుపుకొంటే ప్రస్తుతం బస్తా రూ.13,500 అవుతోంది. ఈ ధరల వల్ల లాభాల సంగతి పక్కన పెడితే అసలు వస్తే చాలని పేర్కొంటున్నారు. వినియోగదారులు మాత్రం కిలోకి సరాసరి రూ.200 పెరగడంతో కొనేందుకు వెనకాడే పరిస్థితి నెలకొనడంతో అమ్మకాలు సైతం తగ్గాయని వ్యాపారులు తెలుపుతున్నారు. దీనికితోడు టాంజానియా, ఇండోనేషియాల నుంచి జీడిగింజల దిగుమతి సమయం దగ్గర పడుతోంది. ఇవి వస్తే పప్పుధరలు మరింత పతనమై తమకు నష్టం కలిగే అవకాశం ఉందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వేటపాలెం జీడిపప్పునకు ప్రసిద్ధి. ఇక్కడ దాదాపు 30 దుకాణాలు, కర్మాగారాలు 12 వరకు ఉన్నాయి. ఇక్కడ రోజూ వెయ్యి కిలోలకు పైగా పప్పు విక్రయాలు జరుగుతుంటాయి. విజయవాడ, గుంటూరు, ఒంగోలు, బాపట్ల తదితర ప్రాంతాలకు వ్యాపారులు వీటిని సరఫరా చేస్తారు. కొందరు కొనుగోలుదారులు నేరుగా స్థానికంగా ఉన్న దుకాణాలకు వచ్చి కొంటారు. ప్రస్తుతం పలాస చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పప్పు ఇక్కడికి తీసుకొచ్చి, వ్యాపారులు విక్రయించడం వల్ల స్థానికంగా తయారీ తగ్గిపోయింది. దీంతో దీనిపై ఆధారపడ్డ కార్మికులు సైతం ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కోవాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి.

జీడిపప్పు రకం	ప్రస్తుతం కిలో ధర	గత నెల ధర కిలో
	(రూపాయల్లో)	
స్పెషల్ జంబో(210)	1200	1050
జంబో(డబ్ల్యు–240)	980	910
అమెరికన్(డబ్ల్యు–320)	900	790
బద్ద(జేహెచ్)	900	790
ముక్క(కె)	800	700



జీడిపప్పు పొట్టు వలుస్తున్న మహిళలు

రేపల్లె నూరు పడకల ఆసుపత్రి కలేనా!

మెరుగైన వైద్యం అందక ఇబ్బంది పడుతున్న ప్రజలు

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: రేపల్లె పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షగా మారింది. పెరుగుతున్న జనాభా దృష్ట్యా 1962లో మున్సిపాలిటీగా ఏర్పడినా నేటికీ తగిన వైద్య సేవలు అందడం లేదు. 2019లో జరిగిన ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే రేపల్లె 30 పడకల వైద్యశాలను నూరు పడకలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తరువాత హామీని అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గాలి కొదిలేశారు. నాటి నుంచి నేటి వరకు పురవాసులు నామమాత్రపు వైద్యసేవలే అందుతున్నాయి.



పాడై నిరుపయోగంగా సిబ్బంది భవనం

ఓపీ పెరిగినా సదుపాయాలు లేవు

నియోజకవర్గంలో పెద్దాసుపత్రిగా పేరున్న రేపల్లె సీహెచ్‌సీకి ఎక్కువ మంది రోగులు వస్తున్నారు. గతంలో 200 నుంచి 250 వరకు వచ్చే ఓపీ ప్రస్తుతం 350కి చేరింది. రోగుల సంఖ్య పెరగడంతో వారికి సరిపడిన మంచాలు లేక ఆసుపత్రిలో ఉండి వైద్యం పొందే అవకాశం కోల్పోతున్నారు. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, భట్టిప్రోలు మండలాల్లో రోడ్డు ప్రమాదాలు, పాము కాటుకు గురైతే ఇక్కడికే తీసుకొస్తారు. వాహనాలు ఢీకొని చేయి, కాలు ఎముక చిన్నపాటి పగుల్లిచ్చినా ఇక్కడ చేయలేమని ఏరియా జిల్లా ఆసుపత్రికి, గుంటూరు, తెనాలి కానీ తీసుకెళ్లమని వైద్యులు చేతులు దులుపుకుంటున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఔషధాల కొరత తలెత్తడంతో ఇతర ఆసుపత్రుల నుంచి తీసుకురావాల్సిన పరిస్థితి. రోగులకు భోజన సదుపాయంలేదు. సిబ్బంది బసచేసే భవనాలు పాడవడంతో స్థానికంగా ఉండడం లేదు. లోతట్టు ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు పెరిగి పాములకు నిలయంగా మారాయి.



రేపల్లె ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం

100 పడకలతో ప్రయోజనాలు

30 పడకలను 100గా అభివృద్ధి చేస్తే పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుంది. గుండె, ఎముకలు, శస్త్ర చికిత్స వైద్య నిపుణులు అందుబాటులోకి వస్తారు. 24 గంటలు సేవలందించే నర్సులు, సిబ్బంది కొరత ఉండదు. ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, పాముకాటుకు గురైన బాధితులను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లే వ్యవప్రయాలు ఆర్థిక కష్టాలు తీరతాయి.

ప్రతిపాదనలు సిద్ధం

రేపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకలుగా అభివృద్ధి చేసేందుకు ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. రోగుల సంఖ్య పెరిగిందని వారికి సరిపడిన సదుపాయాల్లేవని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. 50 పడకలకు అనుమతి వస్తే మెరుగైన వైద్యం, సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. -సుధాకర్, సూపరింటెండెంట్ రేపల్లె సీహెచ్‌సీ.

కాలువలపై డ్రోన్ సేవలు

ప్రభుత్వ ఆదేశాలతో జల వనరుల శాఖ సన్నాహాలు

న్యూస్‌టుడే - చీరాల గ్రామీణం

అది రొంపేరు కుడి కాలువ.. నీటి ప్రవాహానికి అడ్డంకి.. ఎక్కడో తెలియని పరిస్థితి. ఓ డ్రోన్ ఎక్కడ సమస్య తలెత్తిందో.. చిత్రం తీయడంతో పరిష్కారానికి నోచుకుంది. గతంలో ఈ పనిని లస్కర్లు చూసేవారు.. నేడు చాలా చోట్ల వారు లేరు.. ఆ స్థానాన్ని డ్రోన్లు భర్తీ చేయనున్నాయి. వీటి సాయంతో ఇలా వాగులు, పంట కాల్వల నిర్వహణ సులభతరం కానుంది. కాల్వల చిత్రాలు, వీడియోలు సేకరించి అధ్యయనం చేయడానికి అవకాశం లభించనుంది.



వ్యవసాయంలో సాగు నీటితో పాటు మురుగునీటి కాల్వలు, వాగులు చాలా కీలకం. వీటిని ఎప్పటికప్పుడు పరిశీలించి, సకాలంలో నివేదికలు తయారు చేయడానికి ఈ రెండు శాఖలలో లస్కర్ల పేరుతో ప్రత్యేక ఉద్యోగులు ఉండేవారు. నిరంతరం కాల్వలపై ఉంటూ.. అధికారులకు తాజా సమాచారం ఇవ్వడమే వీరి విధి. దశాబ్ద కాలంగా వీరి నియామకం జరగడం లేదు. పదవీ విరమణ చేస్తున్నవారే కానీ.. కొత్తగా ఈ ఉద్యోగంలోకి వచ్చిన వారు లేరు. దీంతో ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో ఏ కాలువకు ఎక్కడ గండి పడిందో ఎవరూ చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు జల వనరుల శాఖతో సమీక్ష నిర్వహిస్తూ.. కాల్వల నిర్వహణ సమస్య చర్చకు వచ్చింది. కాల్వల పరిశీలనకు పూర్తి స్థాయిలో డ్రోన్ల సాయం తీసుకోవాలనడంతో ఆ మేరకు అన్ని చోట్లా కసరత్తు ప్రారంభమైంది.

బేసిన్ పరిధి	కాలువలు (మేజర్, మీడియం, మైనర్)	పొడవు (కిలోమీటర్లలో)
రొంపేరు	22	200.64
నల్లమడ	05	136.97
కొల్లిమర	09	92.77

చీరాల కేంద్రంగా..

చీరాల డ్రెయినేజీ ఈఈ కార్యాలయంలో మూడు డివిజన్లు ఉండగా చీరాలలో రెండు, బాపట్లలో ఒకటి ఉన్నాయి. వీటిల్లో మొత్తం 45 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీటి పరిధిలో బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాలు ఉన్నాయి. మొత్తం 36 కాలువలు ప్రవహిస్తుండగా వీటి పొడవు 430.81 కిలోమీటర్లు. బాపట్ల జిల్లాలో ప్రధానంగా రొంపేరు కుడి, ఎడమ, ఈపూరుపాలెం, వేటపాలెం స్ట్రయిట్ కట్లు, పేర్లి, పర్చూరు, కప్పల వాగులున్నాయి. గుంటూరు జిల్లా పరిధిలో పెదనందిపాడు, చేబ్రోలు, పొన్నూరు, వట్టి చెరుకూరు, పల్నాడు జిల్లా పరిధిలో చిలకలూరిపేట, యడ్లపాడు, ప్రకాశం జిల్లా పరిధిలో ఎన్జీపాడు, సంతనూతలపాడు మండలాల పరిధిలో కాల్వలు, వాగులు ఉన్నాయి. వీటిని చీరాల కేంద్రంగా నిర్వహిస్తున్నారు. ఈ కాల్వల్లో జమ్ము గడ్డి నాశనం చేయడానికి పురుగుమందు పిచికారీ చేయడానికి అధికారులు ఈ పాటికే డ్రోన్లను కొంతకాలంగా వినియోగిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో అన్ని చోట్ల డ్రోన్ల వాడకానికి సిద్ధమవుతున్నారు.

ముందుగా మేజర్ కాల్వలు

తొలుత మేజర్ కాల్వలు, వాగులపై డ్రోన్లు వినియోగించి వాటి స్థితిగతులు తెలుసుకోవాలని నిర్ణయించారు. వీటి సాయంతో చిత్రాలు, వీడియోలు తీయించి కాల్వ గట్లు, లోపల పూడిక వంటి విషయాలపై ఒక అంచనాకు రావడం తేలికని అధికారులు పేర్కొంటున్నారు. సిబ్బంది ప్రతి చోటుకు వెళ్లలేని పరిస్థితి ఉంటుందని, డ్రోన్ అయితే మనకు కావాల్సిన ప్రాంతానికి సులభంగా వెళ్లి కావాల్సిన సమాచారం అందిస్తుందని అంటున్నారు.

ప్రతిపాదనలు పంపాం

చీరాల పరిధిలో డ్రోన్ల వినియోగానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపాం. తొలుత చీరాలలోని మూడు డివిజన్ల పరిధిలో అన్ని మేజర్ డ్రైనేజీలను వీటి కింద చేర్చాం. త్వరలో అన్ని రకాల సేవల్లో డ్రోన్ల పాత్ర పెంచి సలభంగా కాల్వల మరమ్మతులు, వాగుల నిర్వహణ పనులు చేపడతాం.
– మురళీకృష్ణ, ఈఈ, చీరాల

మంత్రులకు జిల్లాల ఇంఛార్జి బాధ్యతలు

బాపట్ల, న్యూస్‌టుడే: తెదేపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు నెలలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నియామకం జరిగింది. ఇన్‌ఛార్జి మంత్రి ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించి ప్రగతి పనుల సమీక్ష చేపట్టనున్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా రాష్ట్ర గృహనిర్మాణ, పౌరసంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథిని ప్రభుత్వం నియమించింది. జిల్లాకు చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రిగా, మరో మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రిగా నియమించారు.

పీజీఆర్‌ఎస్‌లో నమోదుతో తక్షణమే పరిష్కారం

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో నమోదైన సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. అమరావతి నుంచి సీసీఎల్ఏ సంయుక్త కార్యదర్శి జయలక్ష్మి మంగళవారం నిర్వహించిన వీక్షణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో వస్తున్న సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టామన్నారు. డీఆర్వో సత్తిబాబు, సీపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐఆర్, డీఏ పాత బకాయిలు మంజూరు చేయాలి

బాపట్ల, రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: ఐఆర్, డీఏ పాత బకాయిలను ప్రభుత్వం తక్షణం మంజూరు చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు కె రోశయ్య కోరారు. గత వైకాపా ప్రభుత్వం ఉద్యోగులపై నిర్లక్ష్యం వహించిందని కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నామన్నారు. ఈనెల 16న జరిగే శాసనసభ సమావేశంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామ స్వరాజ్యానికి కృషి: అనగాని

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని కూటమి ప్రభుత్వం సాకారం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. రేపల్లె మండలం వేజెళ్లవారిలంక, బేతపూడి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పల్లెపండగ వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పల్లెప్రగతి పడకేసిందని మండిపడ్డారు. 2014-2019 వరకు 25 వేల కిలోమీటర్లు రోడ్లు వేస్తే వైకాపా వెయ్యి కిలోమీటర్లు కూడా వేయించలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.45వేల కోట్ల ఉపాధి నిధులతో పల్లెలో మౌలిక సదుపాయాలు కల్పించేలా దృష్టి సారించిందని తెలిపారు. పల్లె పండగలో చేపట్టిన పనులు మూడు నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించిందన్నారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ జిల్లాలో రూ.89 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు పరిపాలన, సాంకేతిక పరమైన అనుమతులు ఇచ్చామన్నారు. 775 గోకులాల నిర్మాణాలు జరిగేలా దృష్టి సారించామని తెలిపారు. ఈ కార్యక్రమాలన్నీ పల్లెలో పండగ వాతావరణంలో నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. తొలుత ఎంపీ ల్యాడ్స్ రూ.45 లక్షలతో వేజెళ్లవారిలంకలో నిర్మించిన వాటర్ ట్యాంకు, ఉపాధిహామీ నిధులు రూ.15 లక్షలతో వేజెళ్లవారిలంక, రూ.15 లక్షలతో బేతపూడిలో నిర్మించే సీసీ రోడ్లకు మంత్రి శంఖుస్థాపన చేశారు. ఆర్డీవో రామలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్‌శాఖ ఎస్‌ఈలు అనంతరాజ్, హరేరామకృష్ణ, డ్వామా పీడీ విజయలక్ష్మి, ఏపీడీ సువార్త, తహసీల్దారు శ్రీనివాసరావు, ఎంపీడీవో శోభారాణి, ఏఈ చక్రవర్తి, ఈవోపీఆర్డీ ప్రసాద్ సర్పంచి మోర్ల లక్ష్మీతిరుపతమ్మ తెదేపా నాయకులు మురళీధరరావు, శ్రీనివాసరావు, నరసింహరావు, రాఘవ,తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యప్రసాద్

RC.1574/2024-H5

O/o The Electoral Registration Officer,
Krishna - Guntur Graduates' Constituency
& District Revenue Officer, Guntur.

Annexure-A1

ELECTION COMMISSION OF INDIA

Revision of Electoral Rolls for Krishna-Guntur Graduates' Constituency of Andhra Pradesh Legislative Council.

Notice under Rule 31(4) of the Registration of Electors Rules, 1960

In pursuance of Rule 31(4) of the Registration of Electors Rules, 1960, the Electoral Registration Officer, Krishna-Guntur Graduates' Constituency vide her notice dated:30.09.2024, called upon every person entitled to be registered in the electoral roll of the Krishna-Guntur Graduates' Constituency, to send to, or deliver at, his/her office on or before 06.11.2024 **(i.e. the last date of receipt of applications)** application in Form 18 appended to the Registration of Electors Rules, 1960 and reproduced in the second schedule of the said notice published in the edition dated:30.09.2024 of (1) Eenadu and (2) Andhra jyothi News Papers.

All the above mentioned may submit their applications in Form 18 on or before 06.11.2024 **(i.e. the last date of receipt of applications)**, if not already done.

The said details are also available in the official website of the Chief Electoral Officer, Andhra Pradesh at www.ceoandhra.nic.in

Date: 16.10.2024 Sd/- **P. Roja**
Place: Guntur Electoral Registration Officer
Krishna-Guntur Graduates' Constituency
& District Revenue Officer, Guntur

అంతర్ జిల్లా చోరుల అరెస్టు

రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

బల్లికురవ(అద్దంకి), న్యూస్‌టుడే: మోటారు సైకిళ్ల చోరులను బల్లికురవ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అద్దంకి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారు. ఎస్సై జీవీ.చౌదరి అందించిన సమాచారం మేరకు. . పల్నాడు జిల్లా బొల్లాపల్లికి చెందిన జి.నరసింహారావు, బల్లికురవ మండలం కొత్తూరుకు చెందిన టి.నరసింహారావులు ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తుంటారు. వీరిద్దరూ గతంలో పల్నాడు జిల్లా నరసరావుపేట ఒకటో పట్టణం, శావల్యాపురం, అద్దంకి, పుల్లలచెరువు పోలీస్‌స్టేషన్‌లలో జరిగిన దొంగతనం కేసుల్లో నిందితులు. ఈనేపథ్యంలో వీరిద్దరూ బల్లికురవ మండలంలోని వి.కొప్పెరపాడు కూడలి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసుల్ని చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంబడించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. వినుకొండ పట్టణం, బల్లికురవ మండలం కొత్తూరులో దొంగిలించిన రెండు ద్విచక్ర వాహనాలను అమ్మేందుకు వెళుతున్నామని చెప్పారు. ఆమేరకు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద గల బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

పల్లెల ప్రగతే ప్రభుత్వ లక్ష్యం: గొట్టిపాటి

పమిడిపాడు (మేదరమెట్ల), న్యూస్‌టుడే: పల్లె ప్రగతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కొరిశపాడు మండలం పమిడిపాడులో మంగళవారం నిర్వహించిన పల్లెపండగలో ఆయన పాల్గొన్నారు. ఎస్సీ కాలనీలో రూ.40 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పనుల నాణ్యతలో ఎటువంటి రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానికులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పమిడిపాడు, శివారు గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉన్నట్లు తెలిపారు. ఎస్సీ కాలనీలో సామాజిక భవనం నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వం నిధుల్ని దారి మళ్లించి, పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. గ్రామాల్లో పంచాయతీలను బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి నిధులు విడుదల చేస్తోందన్నారు. యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరలోనే పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. దీని ప్రాముఖ్యతను జేసీకి వివరించారు. జేసీ ప్రఖర్ జైన్, చీరాల ఆర్డీవో డి.అఖిల, విద్యుత్తుశాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంపీపీ సాదినేని ప్రసన్నకుమారి, సీఐ మల్లికార్జునరావు, హౌసింగ్, పీఆర్ ఏఈలు నటరాజ్, ప్రసాదరావు, తెదేపా మండల అధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణ పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి గొట్టిపాటి, చిత్రంలో జేసీ, ఆర్డీవో, అధికారులు

గొర్రెల దొంగతనం కేసులో నలుగురి అరెస్టు

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువు మండలంలోని మనిగే రంగయ్యానాయుడుకు చెందిన గొర్రెలను దొంగిలించిన కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ నరేంద్రారెడ్డి, ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు.పోలీసుస్టేషన్‌లో విలేకరులకు కేసు వివరాలు వెల్లడించారు. ఈనెల 11న రాత్రి మిట్టపల్లి రంగయ్యానాయుడుకు చెందిన 10 గొర్రెలను దుండగులు దొంగిలించారు. దీనిపై కేసు నమోదు చేశారు. మంగళవారం పోలీసులు కదిరి- హిందూపురం ప్రధాన రహదారిలో కొత్తరోడ్డు వనుకువారిపల్లి వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా నిందితులను గుర్తించి పట్టుకున్నారు. వీరిలో బాపట్లకు చెందిన శివశంకర్‌తో పాటు అతడి మిత్రుడు వెంకటేశ్వర్లు, మిట్టపల్లికి చెందిన వరప్రసాద్, చీరాలకు చెందిన పాల్‌రాజు ఉన్నారు. వీరంతా మద్యానికి బానిసై ఆర్థిక పరిస్థితులు బాగోలేక చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. శశికుమార్, వెంకటేశ్వర్లపై బాపట్లలోనూ చోరీ కేసు నమోదైనట్లు గుర్తించారు. గొర్రెలతో పాటు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు.

గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

అమృతలూరు, న్యూస్‌టుడే: అమృతలూరు మండలం కూచిపూడి లాకుల సమీపంలో నిజాపట్నం కాల్వలో రెండు మృతదేహాలను పోలీసులు మంగళవారం గుర్తించారు. సుమారు 50ఏళ్ల వయస్సు ఉన్న పురుషుడు, 45ఏళ్ల వయస్సు కలిగిన మహిళ మృతదేహాలు కాల్వలో కొట్టుకు వచ్చాయి. గ్రామ రెవెన్యూ అధికారి విజయకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై అమరవర్ధన్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. మృతదేహాలను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుమారు వారం రోజుల క్రితం కాల్వలో ప్రమాదవశాత్తు పడి ఉంటారని ఆయన తెలిపారు. మృతదేహాలు ఉబ్బిపోయి గుర్తుపట్టేందుకు వీలులేకుండా ఉందని తెలిపారు. ఏదైనా ఆచూకి తెలిస్తే అమృతలూరు ఎస్సై ఫోన్ నంబరు94409 00852 వివరాలు తెలపాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

అమృతలూరు, న్యూస్‌టుడే: అమృతలూరు మండలం కూచిపూడిలాకు కూడలి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. తెనాలికి చెందిన వెంకటేశ్వరరావు చీరాలలో పనులు ముగించుకుని తెనాలికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఏలూరు నుంచి పిట్టలవానిపాలెం వెళ్లేందుకు తండ్రి పోతురాజు, కుమారులు లక్ష్మీనారాయణ, సత్యంబాబు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. కూచిపూడి లాకుల కూడలి సమీపంలో ఎదురెదురుగా వస్తున్న వీరి ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ఢీకొన్నాయి. ఈ సంఘటనలో వెంకటేశ్వరావు, పోతురాజులకు తీవ్రగాయాలయ్యాయి. లక్ష్మీనారాయణ, సత్యంబాబుకు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



సంఘటనాస్థలంలో గాయపడిన తండ్రి, ఇద్దరు కుమారులు

పావులూరు మైనరుకు గండి

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు మండల పరిధిలోని సాగరు కాలువ పావులూరు మైనరుకు గండిపడి నీరువృథాగా పోతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతోపాటు సాగరు కుడి కాలువకు నిరవధికంగా విడుదల చేస్తున్న నీటితో మేజరు, మైనర్లు నిండుగా ప్రవహిస్తున్నాయి. సాగరు కుడి కాలువకు ప్రస్తుతం పదివేల క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. రామకూరు 37వ మైలు దగ్గర 600 క్యూసెక్కులు విడుదలవుతోంది. కోటపాడు, ద్రోణాదుల, నూతలపాడు, పమిడిపాడు మేజర్లకు వీటిని పంపుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పై మేజర్లకు 200 క్యూసెక్కులు సరిపోతాయి. రెండు రెట్లు ఎక్కువగా విడుదల కావటంతో నీరంతా వృథాగా వాగుల పాలవుతోంది. సోమవారం ఇంకొల్లు పరిసరాల్లో 60 మిల్లీమీటర్ల వర్షం కురవటంతో వర్షపు నీరు కాలువల్లోకి చేరి, కట్టలకు పైగా ప్రవహించాయి. పావులూరు మైనరులో ఇడుపులపాడు డొంక దగ్గర నిర్మించిన సైఫన్ ఎడమ భాగంలో సోమవారం రాత్రి గండి పడి సమీపంలో వాగులోకి ప్రవహిస్తున్నాయి. కోటపాడు మేజరుకు 150 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. పావులూరు మైనరులో కాలువలకు మరమ్మతులు లేనందున నాచు, తూటుకాడ అడ్డుపడి నేరుగా దిగువకు ప్రవహించక కట్టలు పొర్లి, గండ్లు పడే ప్రమాదం ఏర్పడింది. గత నెలలో కురిసిన వర్షానికి పొలిమేర క్షేత్రం సమీపంలో గండిపడింది. ప్రస్తుతం పావులూరు, ఇంకొలు పాతచెన్నై రహదారి మధ్య పలుచోట్ల కట్టలు బలహీనపడ్డాయి. ఏ సమయంలోనైనా గండ్లు పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు దశాబ్దాల కాలంలో ఈ స్థాయిలో కాలువలకు నీరు విడుదల కావటం విశేషమని రైతులు చెబుతున్నారు. ఈవిషయమై ఎన్ఎస్పీ ఏఈ బాలకృష్ణ నాయక్ వివరిస్తూ కుడి కాలువకు 10 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారని, వర్షాల కారణంగా నీటి వినియోగం లేనందున కాలువలు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయన్నారు. పావులూరు మైనరుకు గండి పడటంతో నీటిసరఫరా నిలిపి వేశామన్నారు. గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించి, పూడ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.



ఇడుపులపాడు డొంకదగ్గర ఏర్పడ్డ గండి

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, రిటైల్ ధర - 157, చికెన్ విత్‌స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: రైతులు సేంద్రియ వ్యవసాయం చేయటం ద్వారా చీడపీడల నివారణతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రోగ్రామ్ మేనేజర్ వి. వాణి శ్రీ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నరసాయపాలెం, కంకటపాలెంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎరువులు, పురుగు, కలుపు మందులు వాడకుండా సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయటం ద్వారా నాణ్యమైన పంటలను పొందటంతోపాటు అధికలాభాలు పొందవచ్చన్నారు. జీవామృతం తయారు చేసే విధానాలను రైతులకు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఏడీఏ లక్ష్మి, ఏవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు జీవామృతం తయారీ విధానాన్ని వివరిస్తున్న ప్రోగ్రాం మేనేజర్ వాణిశ్రీ

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

ఒప్పంద అధ్యాపకుల నిరసన

కావూరు(చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒప్పంద అధ్యాపకులు నిరసనకు దిగారు. మంగళవారం కళాశాలలో భోజన విరామ సమయంలో ఒప్పంద అధ్యాపకులు పసుపు బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తపరిచారు. జీవో నంబరు 114ను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రెగ్యులైజేషన్ చేసే సమయానికి ఎన్నికల నియమావళి రావటంతో ప్రక్రియ నిలిచిందన్నారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యను గుర్తించి వెంటనే ఒప్పంద అధ్యాపకులను రెగ్యులైజేషన్ చేస్తుందని ఆశిస్తున్నామని వారు తెలిపారు.

ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు

బాపట్ల, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో లోతట్టు ప్రాంతాల్లో భారీ వర్షానికి చేరిన నీటిని బయటకు పంపి ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ రఘునాథరెడ్డి అన్నారు. పట్టణంలోని శారదాపురికాలనీ, వెన్నెలకంటి నగర్, శాంతి నగర్‌లో లోతట్టు ప్రాంతాలను ఆయన మంగళవారం సందర్శించారు. రహదారులు, ఇళ్ల మధ్య నిలిచిన నిలిచిన బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



శారదాపురికాలనీలో పరిశీలిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? చెరుకుపల్లి పోలీస్ స్టేషన్ వెనుక రామకృష్ణనగర్‌లోని సిమెంటు రోడ్లు చిన్నపాటి వర్షం కురిసినా నీరు రోజులతరబడి నిలుస్తున్నాయి. **-సంపత్‌బాబు. చెరుకుపల్లి, రామకృష్ణనగర్**

✔ సమస్య ఇప్పటివరకు మా దృష్టికి రాలేదు. వానలు తగ్గగానే చర్యలు తీసికొని సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.- **ఈవూరి విజయబాబు. పంచాయతీ కార్యదర్శి,చెరుకుపల్లి**

–న్యూస్‌టుడే, చెరుకుపల్లి

? పెరవలిపాలెం పంచాయతీ పరిధిలో సేకరించిన చెత్తను ఇక్కడి నుంచి పెదపూడి వెళ్లే మార్గం పక్కన పడవేస్తున్నారు. అందులో మిగిలిపోయిన ఆహార పదార్థాలు ఉండడం వల్ల వాటిని కుక్కలు చిందర వందర చేస్తున్నాయి.

- స్థానికుడు, పెరవలిపాలెం

✔ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం - **శేఖర్, ఈవోపీఆర్డీ.**

–న్యూస్‌టుడే, వేమూరు

నేడు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం

చెరుకుపల్లి న్యూస్‌టుడే: చెరుకుపల్లి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్తు సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుబానీ తెలిపారు. జడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావాలని ఆయన తెలిపారు.

అకాల వర్షం.. ఎంతటి కష్టం



వాననీటిలో పేటేరు ఇందిర కాలనీ వాసులు



కొల్లూరు ఐటీఐ కళాశాల ప్రాంగణంలో..



డ్రైవర్స్ కాలనీలో ఇంట్లోకి ప్రవేశించిన నీరు

పేటేరు(రేపల్లె అర్బన్), చెరుకుపల్లి (గ్రామీణ, చెరుకుపల్లి, నగరం, వేమూరు, కొల్లూరు, ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), బాపట్ల, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. దీంతో రైతులు సాగు చేసిన పంట పొలాలు కొంత మేర నీట మునిగాయి. ఇంకా రెండురోజుల వర్షాల నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు వస్తాయోనని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. పేటేరు ఇందిర కాలనీ ప్రధాన రోడ్డుపై వర్షం నీరు నిలిచి రాకపోకలు సాగించేందుకు స్థానికులు అసౌకర్యానికి గురయ్యారు. చెరుకుపల్లిలో ఆగస్టులో కురిసిన అధిక వర్షాలకు వేసిన నాట్లు మునిగిపోగా 7 వేల ఎకరాల్లో రైతులు పైరుపై ఆశలు వదిలి తిరిగి నాట్లు కూడా వేయలేదు. కొంతమంది అన్నదాతలు మళ్లీ నాట్లు వేయగా ప్రస్తుతం మరో పదిరోజుల్లో చిరుపొట్ట దశకు చేరనుండగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పైరు పీకలదాకా నీరు వచ్చింది. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన వర్షపాతం కొలమాని నీటిలో మునిగింది. నగరం గ్రామానికి చెందిన సమ్మెట శ్రీనివాసరావు, తిరుపతి వెంకయ్య, కాంతారావు, రాజశేఖర్ రైతులు సుమారు 43 ఎకరాల్లో ఇప్పటికి మూడు పర్యాయాలు నాట్లు వేశారు. ఆగస్టు చివరి వారంలో మొదటి సారి నాట్లు వేసి అలా వెనక్కు తిరిగీతిరగక ముందే భారీ వానలకు వరి చేలు మునిగాయి. రెండుమూడు వారాల తరువాత సెప్టెంబర్‌లో మళ్లీ నాట్లు వేశారు. భారీ వానలకు మళ్లీ మునిగాయి. ముచ్చటగా మూడోసారి నాటు వేసేందుకు ఆయకట్టు రైతులు మళ్లీ సిద్ధం అయ్యారు. పక్కలమ్మ గుడి మెట్ట భూమిలో నారు పోసి రెండు రోజుల క్రితం నాట్లు వేశారు. మూడు రోజులుగా పడుతున్న వానలకు మళ్లీ మునిగిపోయింది. మూడు పర్యాయాలు నాట్లు వేసినందుకు ఎకరానికి రూ. 35వేల వరకు నష్టం వచ్చిందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. వేమూరు మండలంలో గత నెలలో కురిసిన వర్షానికి మండలంలోని జంపని దక్షణం వైపు పొలాల్లో 150 ఎకరాల్లో వరి దెబ్బతింది. అయితే వాటిలోని కొన్ని పొలాల్లో రైతులు మరలా నాట్లు వేశారు. ఇప్పుడు అవికూడా నీటమునిగాయని చెబుతున్నారు. చావలిలో మురుగుకోడులో భారీగా వరద నీరు చేరింది. కొల్లూరులో మండలంలో ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల ప్రాంగణాలు వర్షం నీటితో నిండి పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఖాజీపాలెం, కోమలి, అలకాపురంలో కష్ట నష్టాలకు ఓర్చి నాట్లు వేశామని ఇలా మళ్లీ ముంపు బారిన పడితే పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంగుపాలెం, భవనంవారిపాలెం, కోమలి వద్ద యాజలి డ్రెయిన్, ఖాజీపాలెం, జి.ఎన్.పాలెం, చందోలు వద్ద తెనాలి డ్రెయిన్ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. బాపట్ల పట్టణంలోని విజయలక్ష్మీపురం, డ్రైవర్స్ కాలనీ, నరాలశెట్టివారిపాలెంలో ఇళ్ల చుట్టూ నీరు చేరింది. నివాస గృహాల్లోకి నీరు ప్రవేశించటంతో పేదలు ఇబ్బంది పడ్డారు. ఇంట్లో నుంచి నీటిని తోడి బయటకు పోశారు.



చెరుకుపల్లి పోలీస్‌స్టేషన్ చుట్టూ చేరిన వర్షపు నీరు



నగరం శివారులో నీట మునిగిన వరిచేలు



రజకపాలెంలో ఇళ్ల మధ్య నిలిచిన నీరు

అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలి

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో అందరూ భాగస్వాములు కావాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. రేపల్లె గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో మంగళవారం పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేపల్లె నియోజకవర్గంలో మొదటి విడతగా 73 పనులు జరుగుతాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన హామీలకు కార్యరూపం దాల్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని ఆయన తెలిపారు. కలెక్టర్ వెంకటమురళి, ఆర్డీవో రామలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్‌శాఖ ఎస్ఈలు అనంతరాజ్, హరేరామకృష్ణ, డ్వామా పీడీ విజయలక్ష్మి, ఏపీడీ సువార్త, తహసీల్దారు శ్రీనివాసరావు, ఎంపీడీవో శోభారాణి, ఏఈ చక్రవర్తి, ఈవో పీఆర్డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలాం



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

బాపట్ల, భట్టిప్రోలు, అమృతలూరు,గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ): దేశ రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా విశేష సేవలు అందించిన మహోన్నత వ్యక్తిగా ఏపీజే అబ్దుల్ కలాం అందరికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఎంపీ కార్యాలయం, పురపాలక కార్యాలయం సమీపంలో ఆయన విగ్రహానికి తెన్నేటి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎంపీ మాట్లాడుతూ సామాన్య పేద కుటుంబంలో జన్మించి స్వయంకృషి, పట్టుదలతో అత్యుతన్నత స్థానాలకు ఎదిగి కోట్ల మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఎంఈవో కార్యాలయం ఎదుట కలాం విగ్రహానికి ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పీసీ సాయిబాబు, సీనియర్ న్యాయవాది జమ్రుద్‌బాషా పూలమాల వేసి నివాళి అర్పించారు. భట్టిప్రోలు టీఎంరావు ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. అమృతలూరులో అబ్దుల్ కలాం జయంతికి బీఆర్ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. చెరుకుపల్లి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

రహదారి కోత - రాకపోకలకు అంతరాయం

గూడవల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: వర్షాలకు ఆర్అండ్‌బీ రహదారి కోతకు గురైంది. మండలంలో గూడవల్లి జాతీయ రహదారి నుంచి పాంచాళవరం ఆర్అండ్‌బీ రహదారి 5 కి.మీ మేర ఉంది. ఇది ఆర్ఎం డ్రెయిన్ కుడి గట్టుపై రెండు కి.మీల మేర ఉంది. ఈ మార్గంలో పంట పొలాల్లో నీటిని డ్రెయిన్‌లోకి పంపేందుకు ఊరి చివర రహదారి కింద గతంలో సిమెంట్ తూములు ఏర్పాటు చేశారు. గత నెలలో వచ్చిన వరద సమయంలో ఇక్కడ డ్రెయిన్‌లో నీరు కట్ట దాటి రోడ్డుపైకి చేరింది. ఆ సమయంలో తూము ఉన్న చోట నేల కోతకు గురైంది. దీంతో తూముల కింద ఇసుక, మట్టి, చిప్స్ కొట్టుకుపోయి పెద్ద గుంత పడింది. తూము కూడా విరిగి నీటి ఉద్ధృతికి అడ్డుగా నిలిచింది. దీంతో రోడ్డు మరింత కోతకు గురికాకుండా స్థానికులు పగిలిన తూమును తీసి బయట వేశారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ద్విచక్ర వాహనాలు మినహా, కార్లు, లారీలు వంటి పెద్ద వాహనాలు రాకపోకలు సాగించే వీలులేదు. రహదారికి మరమ్మతులు నిర్వహించి వాహనాల రాకపోకలకు వీలు కల్పించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



గూడవల్లి సమీపంలో పాంచళవరం రహదారికి పడిన గండి

చర్యలు తీసుకుంటాం..

గూడవల్లి, పాంచాళవరం మార్గంలో ఆర్అండ్‌బీ రహదారి పరిస్థితి తెలుసుకున్నాం. వెంటనే తెనాలి డివిజన్ ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి రోడ్డు మరమ్మతులు చేయిస్తాం. ఈ లోగా తాత్కాలికంగా పంచాయతీ సిబ్బంది, స్థానికులతో కలిసి రాకపోకలకు అనుకూలంగా చర్యలు తీసుకుంటాం. – షేక్ మహబూబ్ సుబానీ, ఎంపీడీవో, చెరుకుపల్లి

గుంతలు పూడ్చారు

ఈనాడు కథనానికి స్పందన

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: మండల కేంద్రం చెరుకుపల్లి ఐలాండ్ కూడలి వద్ద వాహనదారులకు ఇక్కట్లు పాలు చేస్తున్న గుంతలను అధికారులు ఎట్టకేలకు పూడ్చారు. ఈ గుంతలపై ఈనెల 15న ఈనాడులో 'ఇది చెరువు కాదు..జాతీయ రహదారి' శీర్షికన ప్రచురితమైన కథనానికి జాతీయ రహదారి ఏఈ పురుషోత్తమ రాజు స్పందించారు. మంగళవారం సిబ్బందితో గుంతల్లోని నీటిని తొలగించారు. సాయంత్రం అంబేడ్కర్ విగ్రహం చుట్టు ఉన్న గుంతల్లో సిమెంట్ డస్ట్, చిప్స్ మిక్సింగ్ చేసిన మిశ్రమాన్ని వేసి జేసీబీ సాయంతో గుంతలను పూడ్చారు. ప్రస్తుతానికి భారీ గుంతలు పూడుకుపోయి వాహనాల రాకపోకలకు అవాంతరాలు తొలగాయి. కానీ రహదారిని త్వరగా అభివృద్ధి పరచాల్సి ఉంది. లేకుంటే చిన్న వాన పడినా గుంతల్లో వేసిన మిశ్రమం కొట్టుకుపోయి మరల గుంతలు ఏర్పాడతాయని స్థానికులు అంటున్నారు.



చెరుకుపల్లి ఐలాండ్ సెంటర్‌లో గుంతలను పూడ్చుతున్న జేసీబీ

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించాలి

ప్యాపర్రు, బోడపాడు, (అమృతలూరు), న్యూస్‌టుడే: వరిపైరుకు మూడో సారి నత్రజని 25కిలోలు, పొటాష్ 20కిలోలు కలిపి చల్లితే నాణ్యమైన దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయ అధికారిణి లోకేశ్వరి అన్నారు. ప్యాపర్రు, బోడపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

రేపల్లె అర్బన్: తక్కువ ఖర్చుతో అధిక పంట దిగుబడి సాధించేలా రైతులు కృషి చేయాలని వ్యవసాయశాఖ రేపల్లె సహాయసంచాలకులు విజయబాబు సూచించారు. రేపల్లె మండలం చాట్రగడ్డలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

చివరి మజిలీకి చింతే

కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే

బాపట్ల అసలే జిల్లా కేంద్రం. కానీ ఇక్కడ ఆఖరి మజిలీకి అవస్థలు మాత్రం కొదవ లేదు అన్న చందంగా తయారైంది ఇక్కడి శ్మశాన వాటికల పరిస్థితి. ఇన్నాళ్లు కష్ట సుఖాలతో కాలం వెళ్లదీసిన తమవారిని చివరకు ఇక్కడకు చేర్చాల అని మృతుడు, మృతురాలి తరఫున కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు. పట్టణంలోని మల్లికార్జున బృందావనం, డ్రైవర్స్ కాలనీ శ్మశానవాటికలకు దహన సంస్కారాలకు వెళ్లే ప్రజలకు తమ వారి చివరి మజిలీ చింతే అన్నట్లుగా మారింది. ఎటు చూసినా పిచ్చి మొక్కలు మొలవడంతో విష పురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. దహన సంస్కారాల అనంతరం స్నానాలు చేసేందుకు సరైన నీటి సదుపాయం, కనీసం కూర్చునేందుకు కనీసం బల్లలు కూడా లేవని దీంతో ఇబ్బందులు పడుతున్నామని ఇక్కడకు వచ్చే ప్రజలు వాపోతున్నారు.

❖ మల్లికార్జున బృందావనం శ్మశాన వాటిక చుట్టూ 2012లో అప్పటి ప్రభుత్వ హయాంలో ఐడీఎస్ఎంటీ నిధులు రూ.22లక్షలతో తూ.తూ మంత్రంగా ప్రహరీ గోడ నిర్మించి చేతులు దులుపుకున్నారు. కనీసం నాటి నుంచి నేటి వరకు నీటి వసతి కల్పించకపోవటంతో పాటు కూర్చునేందుకు బల్లలు కూడా ఏర్పాటు చేయలేదు.

❖ డ్రైవర్స్ కాలనీలో శ్మశానవాటికకు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టిన గత పాలకులు లోపలి వైపు చదువును చేయకపోవటంతో ఎత్తు పల్లాల్లో మోకాళ్ల లోతులో వర్షపు నిలిచి దహన సంస్కారాల షెడ్డు వద్దకు వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నామని విజయలక్ష్మీపురం, త్యాగరాయ నగర్, డ్రైవర్స్ కాలనీ, వివేకానంద కాలనీ, ఇమ్మడిశెట్టివారిపాలెం ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. కనీసం నీటి సదుపాయం లేకపోవటంతో దుర్వాసన వెదజల్లుతున్న బావిలోని నీటితోనే స్నానాలు చేస్తున్నామని తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టణంలోని శ్మశానవాటికల్లో మరమ్మతులు చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



మల్లికార్జున బృందావనం శ్మశాన వాటికలో పెరిగిన పిచ్చిమొక్కలు



డ్రైవర్స్ కాలనీ దహన సంస్కారాల షెడ్డు ప్రాంతంలో మోకాళ్లలోతులో వర్షం నీరు

కుళాయి నీటి లీకేజీకి మరమ్మతులు

నడింపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని నడింపల్లి యాదవపాలెంలో తాగునీటి కుళాయి నుంచి నీరు వృథాగా పోవడంపై ఈనెల 14న మేమున్నాం..మీతోడు శీర్షికన ప్రచురితమైన సమస్యకు అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యాదర్శి మల్లీశ్వరి కుళాయిని మరమ్మతులు నిర్వహించి తాగునీరు లీకుకాకుండ చర్యలు తీసుకున్నారు.

స్పందనకు వందనం

మురుగు తొలగింపు

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : మండలంలోని కోమలి ప్రధాన రహదారి పక్కన ఉన్న పరివర్తన భవనం ముందు మురుగు నీరు నిల్వ ఉండటంతో స్థానికులు విషయాన్ని 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా 'ఈనాడు' దృష్టికి తీసుకురాగా ఈనెల 9న ప్రచురించటం జరిగింది. స్పందించిన గ్రామ కార్యదర్శి సుజాత పొక్లెయిన్ సాయంతో కాల్వలు తీయించారు.

ఈత పోటీల్లో ప్రతిభ



పతకాలతో అవిజ్ఞ

బాపట్ల: భువనేశ్వర్‌లో ఈ నెల 11 నుంచి 14 వరకు నిర్వహించిన సీబీఎస్సీ జాతీయ ఈత పోటీల్లో బాపట్లకు చెందిన యువ స్విమ్మర్ సీహెచ్ అవిజ్ఞ ప్రతిభ చూపి ఏడు పతకాలు సాధించి సత్తా చాటింది. 50 మీ. ఫ్రీస్టైల్, 50 మీ. బ్యాక్ స్ట్రోక్, 100 మీ. ఫ్రీస్టైల్ రిలే, 100 మీ. మేడ్లీ రిలే పోటీల్లో రాణించి రెండో స్థానంలో నిలిచి నాలుగు రజత పతకాలు సాధించింది. 100 మీ. ఫ్రీస్టైల్, వంద మీ. బ్యాక్ స్ట్రోక్, 200 మీ. బ్యాక్ స్ట్రోక్ విభాగాల్లో మూడో స్థానం సాధించి మూడు కాంస్య పతకాలు గెలిచింది.



పెరవలిపాలెంలో సీసీ రోడ్డు శంకుస్థాపనకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు



బొర్రావారిపాలెంలో..

రాష్ట్ర పునర్నిర్మాణమే ధ్యేయం

వేమూరు, భట్టిప్రోలు, నిజాంపట్నం, ఉల్లిపాలెం (నగరం), కొల్లూరు, ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), అమృతలూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఆనందబాబు తెలిపారు. వేమూరు, భట్టిప్రోలు మండలాల్లో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనకున్న అపారమైన అనుభవంతో రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నారని చెప్పారు. మండలంలోని పెరవలిపాలెంలో రూ. 10లక్షలు, పెరవలిలో రూ. 15లక్షలు, చావలిలో రూ. 25లక్షలు, భట్టిప్రోలు మండలంలోని ఐలవరంలో రూ. 50లక్షలతో నిర్మించే అంతర్గత రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. బొర్రావారిపాలెం, కళ్లిఫలం గ్రామాల్లో సిమెంటు రహదారుల నిర్మాణానికి అధికారులతో కలిసి తెదేపా నాయకులు కేసన సోమయ్య, దాసరి వెంకటేశ్వరరావు భూమిపూజ చేశారు. సర్పంచి కేసన నాగముత్యాలమ్మ, ఎంపీడీవో నాగలక్ష్మి, విస్తరణాధికారి రవి శంకర్, లుక్కా సోమేష్, సచివాలయాల సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు. నగరం మండల పరిధిలోని ఉల్లిపాలెంలో ఎంపీడీవో బొర్రా శ్రీనివాస్ అంతర్గత రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కొల్లూరు మండలంలోని పెసర్లంక, ఆవులవారిపాలెంలో ఒక్కో గ్రామ పంచాయతీకి రూ. 10 లక్షల చొప్పున రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన అంతర్గత రహదారుల నిర్మాణానికి ఎంపీడీఓ నరసింహారావు శంకుస్థాపన చేశారు. గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వం కృషి చేస్తుందని సర్పంచి అనూష అన్నారు. ఖాజీపాలెంలో మంగళవారం నిర్వహించిన 'పల్లె పండగ' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్యాపర్రు, బోడపాడు గ్రామాల్లో మంగళవారం రూ. 40వేల నిధులతో నిర్మించేందుకు పక్కా రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీడీవో శేషమాంబ, తహసీల్దారు నెహ్రూబాబు, ఏవో లోకేశ్వరి, సర్పంచులు హేమచంద్రశ్రీనివాస్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కొల్లూరులో..



భూమి పూజ చేస్తున్న సర్పంచి అనూష


విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రేపల్లె జేఎల్‌బీ నిజాంపట్నం రోడ్డుకు ఉత్తరం వైపు, గరువు రోడ్డు, బేతపూడి, ఉయ్యూరువారి పాలెంలో విద్యుత్తు సరఫరా ఉండదని డీఈ రాజశేఖరబాబు తెలిపారు. వినియోగదారులు గమనించి అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని 11 కేవీ శాంతి నగర్, 11 కేవీ విజయలక్ష్మీపురం ఫీడర్‌లో మరమ్మతుల సందర్భంగా పలు కాలనీల్లో బుధవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ భీమావారిపాలెం, విజయలక్ష్మీపురం, ఇమ్మడిశెట్టివారిపాలెం, మూడోవార్డు, భావరాజుతోట, రెల్లికాలనీ, రైలుపేట, శాంతినగర్, శారదాపురికాలనీ, ఉప్పరపాలెం, జమేదారుపేట, మూలపాలెం పీఎంఏవై కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుడ్‌టచ్- బ్యాడ్ టచ్‌పై అవగాహన

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక బాలిక సదన్‌లోని చిన్నారులకు మంగళవారం పట్టణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గుడ్‌టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. సదన్‌లో ఆశ్రయం పొందుతూ విద్యనభ్యసిస్తున్న చిన్నారుల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. చిన్నవయస్సులోనే చట్టాల పట్ల కొంతమేర అవగాహన పెంచుకుంటే ఎదుటివారు ప్రవర్తించే తీరును వెంటనే పసిగట్టి రక్షించుకోవచ్చన్నారు. పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జాన్స్, ఎస్సై సీహెచ్ చంద్రావ పాల్గొన్నారు.



నిజాంపట్నం: విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై తిరుపతిరావు

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

నిజాంపట్నం, న్యూస్‌టుడే : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండడంతో పాటు మంచి అలవాట్లు అలవర్చుకోవాలని నిజాంపట్నం ఎస్సై కె. తిరుపతిరావు విద్యార్థులకు సూచించారు. మంగళవారం వికాస్ పాఠశాల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యమాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మంచి ప్రవర్తన కలిగి విద్యపై దృష్టి సారించాలని ఆయన కోరారు.

పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించాలి

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించాలని డీఎస్పీ రామాంజనేయులు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని వెదుళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఇక్కడ నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మద్యం అక్రమ విక్రయాలు, సారా తయారీ కేంద్రాలను అరికట్టాలన్నారు. ఆయన వెంట ఎస్సై పి. జనార్ధనరావు, పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

చేనేత కార్మికులకు బియ్యం పంపిణీ

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చేనేత కార్మికుల మగ్గాల గుంతల్లోకి నీరు వచ్చి కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఈ మేరకు ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం అందించిన పది కిలోల బియ్యాన్ని మంగళవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పంపిణీ చేశారు

సాంకేతిక కారణాలతో పని చేయని రైల్వే గేటు

బాపట్ల, న్యూస్‌టుడే: ఈతేరు- గుడిపూడి మార్గంలో రైల్వేగేటు సాంకేతిక కారణాలతో మంగళవారం రాత్రి మూడు గంటలకు పైగా పని చేయకపోవటంతో వాహనాలు నిలిచిపోయి గ్రామస్థులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. భర్తిపూడి- గుడిపూడి మార్గంలో ఆర్‌యూబీ నిర్మాణానికి రైల్వేగేటును ఏడాది క్రితం మూసివేశారు. ఇంత వరకు నిర్మాణ పనులు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో గుడిపూడి, భర్తిపూడి వాసులు ఈతేరు-గుడిపూడి మార్గంలో వాహనాల్లో తమ గ్రామాలకు వెళ్తున్నారు. ఈ మార్గంలోని రైల్వేగేటు సైతం మంగళవారం రాత్రి తెరుచుకోకపోవటం రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. గ్రామానికి వెళ్లే మార్గం మూసుకుపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

సమష్టిగా కృషిచేద్దాం.. పరిష్కరిద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య, పక్కన కమిటీ సభ్యులు, డాక్టర్లు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: వైద్యశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషిచేద్దామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ప్రభుత్వ వైద్యశాలకు అధిక భాగం పేదలు వస్తుంటారు... వారిని ఆప్యాయంగా పలకరించి సేవలందించాలన్నారు. ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ డాక్టర్లు లేకపోవడంతో ప్రమాదాలబారిన పడి వచ్చే వారిని గుంటూరు, ఒంగోలుకు పంపాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, కొత్త పరికరాల కొనుగోలు, అంతర్గత రహదారుల నిర్మాణంని ఎమ్మెల్యేకి సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి విన్నవించారు. కమిటీ సభ్యులు బండారుపల్లి హేమంతకుమార్, వలివేటి మురళీకృష్ణ, డాక్టర్లు సజ్జా హేమంత పాల్గొన్నారు. అనంతరం రెండు మార్చురీ బాక్సులకు రూ.35 వేలను ఎమ్మెల్యే కొండయ్య అందజేశారు. తాలూకా వార్డుల్లో వసతులను పరిశీలించారు.

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

దుర్గామాతకు మంత్రి పూజలు

వేమవరం(అద్దంకి), న్యూస్‌టుడే: బల్లికురవ మండలం వేమవరం తండా వద్ద స్థానికులు నెలకొల్పిన దుర్గామాత విగ్రహం వద్ద మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థుల ఆహ్వానం మేరకు అమ్మవారి విగ్రహం వద్దకు వచ్చిన ఆయనకు స్థానికులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు.



వేమవరం తండా వద్ద ఆశీర్వచనం అందుకుంటున్న మంత్రి గొట్టిపాటి

పొంగిన వాగులు.. నీటిలో పొలాలు



రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



చిన్నవాదలో పొలాల్లోకి చేరిన వర్షపు నీరు

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయానికి నియోజకవర్గంలోని చీరాలలో 72.2 మీ.మీ, వేటపాలెంలో 36.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉదయం తొమ్మిది గంటల వరకు కొంచెం వాన పడినా ఆ తరువాత ఎండ కాసింది. దీనికితోడు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పర్చూరు వాగు నుంచి రొంపేరు రైట్ ఆర్మ్ ద్వారా వేటపాలెం ప్రాంతంలో ఉన్న పొలాల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది. దీని వల్ల చిన్నవాదలోని పల్లపు ప్రాంతంలో ఉన్న భూముల్లో సాగుచేసిన వరి పొలాల్లో నీరు నిలిచింది. మునసబు వాదలో దాదాపు వంద ఎకరాల్లో వేసిన నారుమళ్లు పూర్తిగా మునిగిపోయాయి.

బుర్లవారిపాలెం, వాద, గవినివారిపాలెం, కావూరివారిపాలెం, దేవినూతల, వేటపాలెం మండలంలోని పందిళ్లపల్లి, కొత్తపేట, వేటపాలెం ప్రాంతాల్లో దాదాపు రెండు వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. మురుగు కాల్వల్లో దీర్ఘకాలికంగా పూడికతీత లేకపోవడం, దట్టంగా తూటుకాడ పెరగడంతో వరదనీరు పొలాల్లోకి చేరుతోంది. వీటికి పూడికతీసి ఉంటే నేరుగా సముద్రంలోకి నీరు కలిసేదని రైతులు పేర్కొంటున్నారు.

✤ వేటపాలెం-సంతరావూరు రోడ్డులో ముసలమ్మ కాలువ వంతెన దాటిన తరువాత రహదారిపై మూడు అడుగులకుపైగా నీరు చేరింది. దీంతో ద్విచక్ర వాహనదారులు దీన్ని దాటేందుకు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరైతే తమ బండ్లను నీటిలో నడిపించుకుని వెళ్లారు. ఆ తరువాత నీటిమట్టం తగ్గడంతో రాకపోకలు యథావిధిగా సాగాయి.

ఉద్ధృతంగా దోర్నపు వాగు



దోర్నపు వాగు వద్ద స్థానికులకు సూచనలిస్తున్న సీఐ కృష్ణయ్య

పేరాయపాలెం(అద్దంకి), న్యూస్‌టుడే: మండలంలోని పేరాయపాలెం వద్ద దోర్నపు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారం మధ్యాహ్నం వరకు వంతెన దిగువను తాకిన నీరు సాయంత్రానికి వంతెన పైభాగంలో ప్రవహిస్తోంది. రాకపోకలకు కొంత ఆటంకం ఏర్పడింది. కొత్తగా పైపు కల్వర్టు నిర్మించారు. భారీ వాహనాలను దీనిపై అనుమతించకుండా పక్కనే గల కాజ్‌వే ద్వారా వాహనాలు వెళ్లేవి. ఇటీవల కురిసిన వర్షాలకు కాజ్‌వే దెబ్బతినడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజల రాకపోకలు పైపు కల్వర్టు మీదుగా సాగుతున్నాయి. దోర్నపువాగు ఉద్ధృతిని అద్దంకి సీఐ పి.కృష్ణయ్య పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు.

✤ కొరిశపాడు మండలం మేదరమెట్ల ఎస్టీ కాలనీ సమీపంలో వర్షపు నీరు వెళ్లే కాలువ మూసుకుపోవడంతో ఇళ్లలోకి, సమీపంలోని పొలాలలోకి చేరింది. వెంటనే అక్కడికి చేరుకున్న పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ కార్మికులతో కాలువకు అడ్డుగా ఉన్న పూడికను తొలగించడంతో నీరు వెళ్లిపోయింది.



ఎస్టీ కాలనీలో ఇళ్లలోకి చేరిన నీరు



పోలూరు- జాగర్లమూడి మార్గంలో వంతెనపై నుంచి ప్రవహిస్తున్న పర్చూరు వాగు



కారంచేడు మండలం దగ్గుబాడులో పాఠశాలను చుట్టిముట్టిన నీరు

యద్దనపూడి, కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: యద్దనపూడి, కారంచేడు గ్రామాల్లో మంగళవారం పోతినవారిపాలెం, ద్రోణాదుల వద్ద పలు వాగుల చప్టాలు, వంతెనల పైకి వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధానంగా యద్దనపూడి-చిలుకూరివారిపాలెం, పోలూరు-జాగర్లమూడి గ్రామాల మధ్య పర్చూరు వాగు వరద నీరు ప్రమాదకర స్థాయికి చేరింది. వంతెనపై 6-10 అడుగుల ఎత్తు మేరకు నీరు చేరడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. కారంచేడు మండలం పోతినవారిపాలెం వద్ద వాగు చప్టాపైకి నీరు చేరింది. ద్రోణాదుల-నాగండ్ల మధ్య వాగులో వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. వింజనంపాడు, చిలుకూరివారిపాలెం మధ్య పత్తి పొలాలు మూడు రోజులుగా నీటిలోనే ఉన్నాయి. దగ్గుబాడులోని ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి నీరు చేరింది. కారంచేడు ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఇళ్ల మధ్య నీరు నిలవడంతో స్థానికులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



వింజనంపాడు సమీపంలో నీటిలో నానుతున్న పత్తి పైరు



యద్దనపూడి- చిలుకూరివారిపాలెం మధ్య వంతెనపై ఆరడుగుల మేర ప్రవహిస్తున్న నీరు

పల్లెల ప్రగతే ధ్యేయం



బల్లికురవ కూడలి వద్ద సిమెంటురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



పుట్టావారిపాలెంలో..

చీరాల, పర్చూరు, కారంచేడు(మార్టూరు), మార్టూరు, యద్దనపూడి, అద్దంకి, జే పంగులూరు, సంతమాగులూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగా పల్లెల ప్రగతి కోసం గ్రామాలు అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే కొత్తపేట పంచాయతీలో రూ.13 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు, వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెంలో రూ.30 లక్షల వ్యయంతో రహదారులకు శంకుస్థాపన చేశారు.

● పర్చూరు నియోజకవర్గంలోని పర్చూరు, మార్టూరు, కారంచేడు, యద్దనపూడి మండలాల్లోని గర్నెపూడి, తన్నీరువారిపాలెం, ఇనగల్లు, సూరవరపుపల్లె, అనంతవరం, బొబ్బేపల్లి గ్రామాల్లో వివిధ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఎంపీడీవోలు ప్రద్యుమ్నకుమార్, నేతాజీ, శ్రీనివాసరావు, జావేద్, తెదేపా మండల అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, నల్లపనేని రంగయ్య చౌదరి, తేలప్రోలు సాంబశివరావు పాల్గొన్నారు.

● అద్దంకి మండలం మైలవరం, ఉప్పలపాడు, వెంపరాల, చక్రాయపాలెం గ్రామాల్లో సిమెంటు రహదారులు, గోకులం నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.



మార్టూరు: బొబ్బేపల్లిలో భూమిపూజలో అధికారులు, ప్రతినిధులు

అద్దంకి ఎంపీడీవో బి.సింగయ్య పాల్గొన్నారు. * జే పంగులూరు మండలం అలవలపాడు, రేణంగివరం, కశ్యాపురం గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపరాణి, అధికారులు, గ్రామ తెదేపా నేత బోరెడ్డి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు. * బల్లికురవ మండలం చెన్నుపల్లి, బల్లికురవ, నక్కబొక్కలపాడు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలకు ఎంపీడీవో కుసుమకుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. * సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు సన్నెబోయిన గురుయాదవ్, మాదాల సుబ్బారావు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి

కారంచేడు(మార్టూరు): విద్యను అభ్యసించేందుకు వెళ్లాలంటే చిన్నారులు ఈదాల్సిందేనని, పాఠశాల చుట్టూ వాననీరు చేరుకోవడంతో ఆవైపు వెళ్లే పరిస్థితులు లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆందోళన చేపట్టక తప్పదని వాపోయారు. మంగళవారం కారంచేడు ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దగ్గుబాడు పాఠశాల చుట్టూ నీటి తటాకాన్ని తలపించడంపై ఆ గ్రామ ప్రతినిధి సమస్య తీవ్రతను సభ దృష్టికి తీసుకొచ్చారు. కారంచేడు ప్రభుత్వ వైద్యశాల పరిసరాల్లో అపరిశుభ్రత తాండవిస్తోందన్నారు. ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసే శనగ విత్తనాల ధరకన్నా రైతుల వద్ద ఉన్న విత్తనాల ధర తక్కువగా ఉందని సభలో తెలిపారు. రైతులకు సాగునీరు సరఫరా సక్రమంగా జరిగేలా కాలువలకు పడిన గండ్లు పూడ్చాలని కోరారు. పలు సమస్యలను ప్రజాప్రతినిధులు సభ ముందు పరిష్కరించాలని కోరారు. ఎంపీడీవో నేతాజీ, ఎంపీపీ ఎన్.వాసుబాబు, అదనపు తహసీల్దార్ అనిత, ఏవో సుధీర్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

వాహన రద్దీ.. కనిపించని గస్తీ

ప్రమాదకరంగా రామ్‌నగర్ కూడలి



రామ్‌నగర్ కూడలి

రామ్‌నగర్ (అద్దంకి), న్యూస్‌టుడే

అద్దంకి పురపాలక సంఘంలో కీలకమైన కూడళ్లలో రామ్‌నగర్ ఒకటి. నామ్ రహదారిపై మేదరమెట్ల, నాగులపాడు, వేలమూరిపాడు, దక్షిణ అద్దంకి వెళ్లే ప్రజలకు ఇది ప్రధాన కూడలి. కల్యాణ మండపాలు, వ్యాపార దుకాణాలు, ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం, ఏఎంసీ కార్యాలయం, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, అగ్నిమాపక కేంద్రం వంటి కార్యాలయాలున్న ప్రాంతం. ప్రతి ఆదివారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో కూరగాయల సంత, చేపల మార్కెట్ నిర్వహిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన కూడలి ఆక్రమణలకు గురైంది. వీటిని తొలగించి కూడలిని విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే రక్షిత మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి రామ్‌నగర్ కూడలి వరకు సిమెంటు రోడ్డు అసంపూర్తిగా మిగిలి ఉంది. దాన్ని వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనికితోడు నామ్ రహదారిపై నిరంతరం వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. పొలాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులు ఇంటికి తరలించే దక్షిణ అద్దంకి, వేలమూరిపాడు రైతులు నిరంతరం రోడ్డు దాటాల్సిందే. ఈ నేపథ్యంలోనే రామ్‌నగర్ కూడలి వద్ద అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో మృతిచెందిన వారు, క్షతగాత్రులైన వారి సంఖ్య ఎక్కువే.

నామ్ రహదారిపై మధురానగర్ నుంచి రాంతీనగర్ మీదుగా బంగ్లారోడ్డు వరకు సర్వీసు రోడ్డులు ఉన్నా ఎక్కువ శాతం వాహన చోదకులు వ్యతిరేక దిశలోనే ప్రయాణిస్తుంటారు. మణికేశ్వరం, కొంగపాడు, వేలమూరిపాడు, నాగులపాడు వంటి గ్రామాలకు వెళ్లే ఆటోలు, ద్విచక్రవాహన చోదకులు ఈ కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని గతంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. ఎప్పటికపుడు నామ్ రహదారిపై జీబ్రా గీతలు వేయించాలని, నిబంధనలకు అనుగుణంగా వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలని, పోలీసు సిబ్బందిని గస్తీ ఉంచాలని ఆందోళన చేశారు. సిబ్బంది కొరత కారణంగా నియమించలేకపోతున్నట్లు పోలీసులు చెబుతుండటం విశేషం.



అర్ధాంతరంగా నిలిచిన సిమెంటు రహదారి

ఆక్రమణలు తొలగించాలి



రాత్రి సమయంలో రోడ్డు దాటాలంటే భయమేస్తోంది. నిబంధనలకు అనుగుణంగా వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలి. దీనికితోడు కూడలికి నలుదిక్కులా ఆక్రమణలు పెరిగాయి. వాహనాల రాకపోకలకు వీలుకలిగేలా ఆక్రమణలు తొలగించాలి. **- గుంటూరు వీరాస్వామి, చిరు వ్యాపారి, రామ్‌నగర్ కూడలి, అద్దంకి**

పనిచేయని సీసీ కెమెరాలు



రామ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఇటీవల సీపీఐ కార్యాలయంలోని టేబుల్ పంకాను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. రహదారుల మలుపు వద్ద జీబ్రా గుర్తులు వేయించాలి. రాత్రివేళ పోలీసు గస్తీ ముమ్మరం చేసి చోరీలు అరికట్టాలి. **- కేఎల్‌డీ.ప్రసాద్, సీపీఐ నేత, రామ్‌నగర్, అద్దంకి**

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం



మార్టూరు: వలపర్ల పాఠశాలలో..



చీరాలలో కలాం విగ్రహానికి నివాళి

చీరాల, మార్టూరు, కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: విద్యార్థులు కలాంను ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి కృషిచేయాలని వక్తలు పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నేపథ్యంలో మంగళవారం నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో బాలికోన్నత పాఠశాలలో కలాం విగ్రహానికి నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణమోహన్, చుండూరి కృష్ణమూర్తి, భానుచంద్రమూర్తి, దాసరి ఇమ్మానియేల్, సర్విశెట్టి సుబ్బరామయ్య పాల్గొన్నారు. శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథపాలకురాలు డి.ధనమ్మ, హరిప్రసాద్, పాఠకులు పాల్గొన్నారు.

✤ మార్టూరు మండలం వలపర్ల ఉన్నత పాఠశాల, కారంచేడు మండలం కొడవలివారిపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో కలాం జయంతి నిర్వహించారు. కొమ్మి ఫౌండేషన్ ఛైర్మన్ కొమ్మి మహేశ్, ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అద్దంకి, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి, దివంగత ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి రోటరీక్లబ్‌ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో జరిగింది. క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య ఆధ్వర్యంలో గుండ్లకమ్మ ఒడ్డున నివసిస్తున్న పేదలకు దుప్పట్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. న్యాయవాది, రోటరీ సహాయ గవర్నర్ మహమ్మద్ రఫీ, పీఏఎస్.కోటేశ్వరరావు, మలాది శ్రీనివాసరావు, డాక్టర్ ఉబ్బా దేవపాలన, సందిరెడ్డి శ్రీనివాసరావు, లెవీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దస్త్రాల్లో పొందుపరచండి

అద్దంకి, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల ఫోన్ నంబర్లు, వారి తల్లిదండ్రుల ఆధార్ నంబర్లు దస్త్రాల్లో పొందుపరచాలని చీరాల ఉప విద్యాధికారి అబ్బరాజు శ్రీనివాసరావు అన్నారు. అద్దంకి మండల విద్యావనరుల కేంద్రం, శింగరకొండ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. విద్యావనరుల కేంద్రంలో ప్రైవేటు విద్యాలయాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. 9, 10 తరగతులు విద్యార్థుల 'ఆపార్' గుర్తింపు నంబర్లు వెంటనే అందించాలన్నారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులు అర్పించారు.

సమయపాలన పాటించాలి

బొడ్డువానిపాలెం (మేదరమెట్ల), న్యూస్‌టుడే: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో రాజ్యలక్ష్మి అన్నారు. కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం గ్రామ సచివాలయాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాలు పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన పల్లెపండగలో పాల్గొన్నారు. రూ.20 లక్షలతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. సర్పంచి నేరెళ్ల సుబ్బయ్య, తెదేపా నాయకులు చింతం సుబ్బారావు, అధికారులు పాల్గొన్నారు.

చేజారిన సంచి ప్రయాణికుడికి అప్పగింత

ఇంకొల్లు, న్యూస్‌టుడే: పోగొట్టుకున్న సంచిని ప్రయాణికుడికి అప్పగించి నిజాయతీ నిలుపుకొంటున్నారు ఆర్టీసీ ఉద్యోగులు. ఇంకొల్లుకు చెందిన విశ్రాంత ఉద్యోగి సుబ్బయ్య మాష్టారు రాజమహేంద్రవరం పిరమిడ్ ధ్యానానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో తనవెంట తెచ్చుకున్న సంచుల్లో ఒకటి చీరాల బస్‌స్టేషన్‌లో మరచిపోయి, ఇంకొల్లు వచ్చారు. బస్‌స్టేషన్‌లో రెండో సంచి లేకపోవటం గమనించి కంట్రోలర్ బాబుకు విషయం తెలిపారు. బాబు చీరాల ఆర్టీసీ అధికారులకు సమాచారం తెలుపగా అక్కడి సిబ్బంది వెతికి సంచిని బస్సులో ఇంకొల్లుకు పంపారు. దానిలో నగదు, విలువైన పత్రాలు, ఏటీఎం కార్డులు ఉన్నట్లు సుబ్బయ్య తెలిపారు. సంచి ఆచూకీ కనుగొని తనకు అప్పగించిన కంట్రోలర్ బాబు, ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు.

వేమవరం పాఠశాల పరిశీలన

వేమవరం(అద్దంకి), న్యూస్‌టుడే: బల్లికురవ మండలం వేమవరం ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎస్సై జీవీ.చౌదరి పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థుల సంఖ్య అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వారానికి ఒకసారి బడిని సందర్శిస్తూ స్నేహపూర్వక పోలీసు విధానాన్ని తెలియజేసినట్లు చెప్పారు. విద్యార్థినులపై ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే తమకు తెలియజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

లడ్డూ విజేతలు వీరే..

అద్దంకి, న్యూస్‌టుడే: శ్రీచక్ర సహిత వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు లడ్డూ ప్రసాదాలకు వేలం ద్వారా విజేతలను నిర్ణయించారు. 53 కిలోల లడ్డూను లాటరీలో కురిచేటి దినేష్, 18 కిలోల లడ్డూను అరవపల్లి సురేంద్ర, బంగారు కాయిన్ వూటుకూరు పూర్ణచంద్రరావు దక్కించుకున్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో వూటుకూరు రామకోటేశ్వరరావు, అరవపల్లి హనుమంతరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, చిన్ని శ్రీనివాసరావు, చిన్ని వీరయ్య, కొల్లిపర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వృద్ధులకు పింఛన్ల పంపిణీ

చీరాల, న్యూస్‌టుడే: వృద్ధులకు చేయూతనిచ్చి ఆదుకొనేందుకే ఆవోపా పింఛన్ల పంపిణీ నిర్వహిస్తున్నట్లు ఆ ప్రాజెక్టు ఛైర్మన్ మారుటూరి రాఘవేంద్రరావు, అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆవోపా ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ మంగళవారం సంఘ కార్యాలయంలో నిర్వహించారు. నగదుతో పాటు బియ్యం, గొడుగులు పంచారు. ఎంఎస్ సుబ్బారావు, సుకన్య, ఏకాంబరేశ్వరబాబు, వెంకట రామయ్య, నారాయణ, భాగ్యలక్ష్మి, శోభారాణి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఏలూరి చినగంజాం రాక

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం, సోపిరాల, పూలవారిపాలెం గ్రామాల్లో పల్లె పండుగలో భాగంగా నిర్మించనున్న ఏడు అంతర్గత సిమెంటు రోడ్లకు బుధవారం భూమి పూజ నిర్వహించనున్నట్లు పంచాయతీరాజ్ శాఖ ఏఈ గుంటుమల్ల రామచంద్రుడు తెలిపారు. దీనికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హాజరుకానున్నట్లు చెప్పారు.

నిర్వహణ రుసుములు విడుదల చేయాలి

చీరాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు అందించే రుసుములు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి.శామ్యూల్ పేర్కొన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో శామ్యూల్ మాట్లాడుతూ రెండేళ్లుగా నిర్వహణ రుసుములు రాక ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. . నియోజకవర్గ అధ్యక్షుడు ఎ.బాబూరావు ఉన్నారు.

ఆధునిక విజ్ఞానంపై అవగాహన అవసరం

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నీట మునిగిన వరి పంటలను యాజమాన్య పద్ధతులు అనుసరించి కాపాడుకోవాలని ఈవో సుమతి సూచించారు. చీరాల మండలం గవినివారిపాలెం, వాడరేవు గ్రామాల్లో పొలం పిలుస్తోందిలో భాగంగా సిబ్బందితో కలిసి వరి పంటలను పరిశీలించారు.

తంగేడుమల్లి (సంతమాగులూరు), న్యూస్‌టుడే: రైతులు అందుబాటులో ఉన్న నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు సూచించారు. తంగేడుమల్లిలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోందిలో ఆధునిక వ్యవసాయ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి అంజిరెడ్డి పాల్గొన్నారు.

అద్దంకి, జే పంగులూరు, న్యూస్‌టుడే : తుపాన్ల సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో కె.వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని వెంకటాపురం, విప్పర్లవారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఉద్యాన శాఖాధికారిణి దీప్తి మాట్లాడుతూ రాయితీపై తైవాన్ స్ప్రేయర్లు అందిస్తున్నట్లు చెప్పారు. ✤ జే పంగులూరు మండలంలోని బూదవాడ, కల్లంవారిపాలెం గ్రామాల్లో మినుము పంటను పరిశీలించిన ఏవో డి.సుబ్బారెడ్డి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, హరిబాబు పాల్గొన్నారు. ✤ బల్లికురవ మండలంలోని అంబడిపూడి, వల్లాపల్లి పొలాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఏవో ఎస్‌వీపీ.కుమారి పాల్గొన్నారు.

మార్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని వలపర్ల, కోనంకి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఏవో వీరగంధం కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ముప్పాళ్లలో నేత్రదానం

ముప్పాళ్ల (ఇంకొల్లు): రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో నేత్రదానం జరిగింది. ముప్పాళ్లకు చెందిన జెట్టి వెంకటేశ్వర్లు(68) మంగళవారం మృతిచెందారు. కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు రోటరీ అవయవ నేత్రదాన సలహా కేంద్రం ప్రతినిధులు జెట్టి స్వామి, ఎస్.రామమోహనరావు పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి సిబ్బందిని పిలిపించి, మృతుడి కార్నియాలను సేకరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉలవపాడు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తి వైనమిది. ఎస్సై అంకమ్మ వివరాల మేరకు.. ఇటీవల నెల్లూరు జిల్లాలోని ఉలవపాడు బైపాస్ రోడులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళుతున్న తనసాన నాగేశ్వరరావు (65) గాయపడ్డాడు. ఇతనిది కారంచేడు. గౌరవరం నుంచి కారంచేడుకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అతన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా మంగళవారం ప్రాణాలు కోల్పోయాడు.

శ్రీనివాసరావు మృతిపై అనుమానాలు?

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: నాలుగు రోజుల కిందట వాడరేవు-కీర్తివారిపాలెం వద్ద జరుగుతున్న రహదారి నిర్మాణంలో ఉన్న కల్వర్టు నీటి కుంటలో పడి పులి శ్రీనివాసరావు అలియాస్ బాతుల శ్రీను మృతిచెందడంపై అనేక అనుమానాలున్నాయని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పేర్కొన్నారు. మంగళవారం వేటపాలెం మండలం పాపాయిపాలెంలో మృతుడి ఇంటివద్ద వారు విలేకర్లతో మాట్లాడుతూ ప్రమాదానికి గురై చనిపోయారని తాము అనుకోవడంలేదన్నారు. ఉద్దేశపూర్వకంగానే అతడ్ని హత్య చేశారనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఆరోజు రాత్రి ఇంటి వద్ద ఉన్న అతనికి ఫోను రావడంతో బయటకి వెళ్లి మరుసటి రోజు శవమై కనిపించడం, తలకు బలమైన గాయం ఉండటం, ద్విచక్రవాహనం తాళం ఆఫ్ చేసి ఉండటం, బండి న్యూట్రల్‌లో ఉండటం, ఇటీవల భూ వివాదం నెలకొన్న తరుణంలో మృతిచెందడం, దీనికితోడు కాళ్లకు చెప్పులు, సెల్‌ఫోన్ లేకపోవడం, మృతదేహాన్ని పోలీసులు హడావిడిగా తరలించడం హత్య అనే దానికి మరింత బలం చేకూరుస్తున్నాయన్నారు. ఇప్పటికైనా పోలీసులు ఈ కేసులో నిష్పక్షపాతంగా విచారణ చేసి, నిజాలను నిగ్గుతేల్చి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.